మహిళలకు శిక్షణ

ఉదయగిరి : పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో ఉన్న చెక్కనగిషీ వస్తువుల తయారీ కేంద్రంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మహిళా కళాకారులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం ఖాజారంతుల్లా మాట్లాడుతూ 40 మంది కళాకారులకు 25 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తామన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

ఆత్మకూరు : మెప్మా ఆధ్వర్యంలో మహిళలు, పురుషులకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. మెప్మా కార్యాలయంలో బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ పాల్గొని, పలు సూచనలు చేశారు.

సులభరీతిలో బోధన చేయాలి

వరికుంటపాడు : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ–2 రమణయ్య సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మంగళవారం పాల్గొని, మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలన్నారు. అనంతరం వారు ఎంఈఓ, రిసోర్సు పర్సన్లను సన్మానించారు.

• **సీతారామపురం :** స్థానిక జెడ్పీ హైస్కూల్లో జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంఈఓ మస్తాన్‌వలీ పాల్గొని, పలు సూచనలు చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

• **అనుమసముద్రంపేట :** ఏఎస్‌పేటలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ సాయిప్రసాద్ వారికి సర్టిఫికేట్లను అందజేశారు.

ఘనంగా సరస్వతీపూజ




మర్రిపాడు : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సరస్వతీ పూజ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ లక్ష్మీదేవి ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శోభాయమానంగా శైవక్షేత్రాలు



ఆత్మకూరు కాశీనాయన ఆశ్రమంలో చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు



కలిగిరి: సిద్ధేశ్వరస్వామి విగ్రహం



దుత్తలూరులోని రామలింగేశ్వరస్వామి

ఆత్మకూరు : మహా శివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తామయ్యాయి. పట్టణంలోని కాశీనాయన ఆశ్రమంలో అదే క్రమంలో చెరువు వద్ద కొలువైన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఇక్కడి ఆశ్రమంలో దుర్గామల్లేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, శివపార్వతుల కల్యాణ ఘట్టాల కోసం నిర్వాహకుడు రామయ్యస్వామి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేవారు. కాగా ఆశ్రమ ప్రాంగణంలో తిరునాళ్ల తిప్పను వివిధ రంగులతో అలంకరించారు. ఆశ్రమానికి వచ్చే దారి పొడవునా కిలోమీటరు మేర ఇరువైపులా విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

• **కలిగిరి :** సిద్ధనకొండూరులోని సిద్ధేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త రూపిశెట్టి రామభద్రరావు ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఉన్న పురాతన శివాలయాల్లో సిద్ధేశ్వరాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. జోడినాగులు, పంచముఖ నాగుల విగ్రహాలు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. పలువురు భక్తులు సొంత ఖర్చులతో ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కలిగిరిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, చిన్నఅన్నలూరు పంచాయతీ అగ్రహారంలోని భైరవస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

• **దుత్తలూరు :** భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా, మహిమాన్వితుడిగా వెలుగొందుతున్న దుత్తలూరులోని రామలింగేశ్వరస్వామి సన్నిధిని అందంగా తీర్చిదిద్దారు. అలాగే నందిపాడు, నరవాడ శివాలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు.

• **సీతారామపురం :** మండలంలోని ప్రాచీన శైవక్షేత్రాలైన ఘటిక సిద్ధేశ్వరం, భైరవకోనలోని శివాలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్, బారికేడ్లను ఏర్పాటు చేశారు.

• **ఉదయగిరి :** ఉదయగిరి, వింజమూరులో కొలువైన శైవక్షేత్రాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని లింగాలదొన, యర్రబల్లిగడ్డ, గండిపాళెం తదితర శైవక్షేత్రాల్లో వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

• **సోమశిల :** మండలంలోని సోమశిల సోమేశ్వరాలయం, చిలకలమర్రి మల్లెంకొండేశ్వర శిలలు, కామిరెడ్డిపాడు దుర్గా మల్లేశ్వరాలయంలో నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

• **జలదంకి:** మండలంలోని బ్రాహ్మణక్రాక శివాలయం హరిహర బుక్కరాయల కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారం ఉన్నాయి. ఈ ఆలయంలో కాశీలో మాదిరిగా అమ్మవారి ఎదురుగా కోనేరు, స్వామివారి ఎదురుగా స్మశానం ఉంది. దీంతో ఈ ఆలయం దక్షిణ కాశీగా పేరొంది భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు రామాల శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు అత్యంత వైభవంగా శివరాత్రి ఉత్సవాలు ఉంటాయి.

మా పాఠశాలను నిర్వీర్యం చేయొద్దు



ఆత్మకూరు : పట్టణంలోని 22వ వార్డు జ్యోతినగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను నిర్వీర్యం చేయొద్దని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేశారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం ధర్నా చేస్తూ.. మాట్లాడారు. ఇక్కడ 3, 4, 5 తరగతులను పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి మెయిన్ పాఠశాలకు తరలించనుండడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని, ఆ ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు.

వలల తొలగింపుతో నష్టపోయాం



ఆత్మకూరు : మండలంలోని ముగగళ్ల పెద్ద చెరువులో చేప పిల్లలు బయటకు వెళ్లకుండా ప్లాస్టిక్ వలలు ఏర్పాటు చేశామని, అయితే రైతులు ఆ వలలను తొలగించారని పలువురు దళితులు ఆర్డీఓ పావనికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పెద్ద చెరువులో 42 కుటుంబాలకుపైగా దళితులు మత్స్యకార సొసైటీలను ఏర్పాటు చేసుకొని కొన్నేళ్లుగా చేపలు పెంచి కుటుంబాలను పోషించుకుంటున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. దళితుల వెంట సీపీఎం నాయకులు ప్రదర్శనగా వచ్చారు.

అశ్వవాహనంపై కోటేశ్వరస్వామి



చేజర్ల : మండలంలోని కోటితీర్థం గ్రామంలో కొలువైన కామాక్షిదేవి సమేత కోటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలో విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

117 జీఓ రద్దుకు వినతి

ఉదయగిరి : విద్యారంగానికి ఆటంకంగా మారిన 117 జీఓను రద్దు చేయాలని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలని కోరుతూ ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి నాయబ్ తహసీల్దార్ సుభద్రకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉర్దూ స్కూళ్లలో ఉపాధ్యాయులను నియమించాలని, సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. సీఐటీయూ నేత నాగేశ్వరరావు, ఆవాజ్ సభ్యులు ఖాజావలీ, విక్రమ్, ఆలంబాషా, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

3లోగా పంట నమోదు పూర్తి



ఆత్మకూరురూరల్ : పంట నమోదును మార్చి 3వ తేదీలోగా పూర్తి చేస్తామని ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని మహిమలూరు పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె హాజరై, మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు. ఏఓ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక

ఉదయగిరి : పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్ మేళాలో 18 మంది యువకులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, సీడాప్‌లు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 39 మంది యువకులు హాజరయ్యారని, వారిలో 18 ఎంపికయ్యారన్నారు. వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి జనార్దన్, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ అక్మల్, విశ్వరూపాచారి, వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

జలదంకి : మండలంలోని జమ్మలపాళెం సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొని ఒకరు గాయాలపాలైన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై లతీఫున్నీసా వివరాల మేరకు.. కలిగిరి మండలం నాగిరెడ్డిపాళేనికి చెందిన శింగంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కావలి నుంచి కలిగిరి వైపు వస్తున్నారు. అదే సమయంలో జలదంకి నుంచి కావలి వైపు వెళ్తున్న జమ్మలపాళెం డైవర్షన్ సమీపంలో బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాజశేఖర్‌రెడ్డికి గాయాలయ్యాయి. అతన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదైంది.

హైస్కూల్‌లో కళా ప్రదర్శనలు

సంగం : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో మంగళవారం డ్రాయింగ్ క్రాఫ్ట్, ఒకేషనల్ ఉపాధ్యాయులు కళాప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్‌ఎస్‌ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ డీఈఓ జానకిరాం పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. పదో తరగతికి సంబంధించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు.

కావలి శివాలయం..
చరిత్రకు సాక్ష్యం



శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన కావలి శివాలయం

కావలి : తుళువ రాజుల కాలం నాటి చారిత్రక జ్ఞాపకాలకు, అమరశిల్పి జక్కన్న వంశీయులు చెక్కిన శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం కావలి శివాలయం. క్రీస్తుశకం 1515కు ముందు తుళువ రాజుల హయాంలో కావలి శివాలయాన్ని నిర్మించగా అదే ఏడాది ఉదయగిరి దుర్గానికి వచ్చిన హరిహరరాయలు ఇక్కడి పరమ శివుడిని దర్శించుకుని సముద్ర స్నానం ఆచరించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. అత్యంత ప్రాచీనమైన ఈశివాలయం ప్రస్తుతం భక్తుల కొంగు బంగారంగా విలాసిల్లుతోంది. ఆలయంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి నిత్యం భక్తుల నిరాజనాలు అందుకుంటున్నారు. ఆదిశంకరాచార్య గురుకుల సంప్రదాయంలో ఇక్కడ అర్చనలు చేస్తున్నారు. అమరశిల్పి జక్కన్న వంశీయులు అద్భుత కళానైపుణ్యం ప్రదర్శించి ఎంతో సుందరంగా ఈ ఆలయంలోని విగ్రహాలను నిర్మించారు. కాగా ఈ క్షేత్రంలో మార్చి 2వ తేదీ వరకు శివరాత్రి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

రామిరెడ్డికి కృతజ్ఞతలు



రామిరెడ్డితో దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వెంకటరావు

కావలి : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన వారు ఆ పార్టీ కావలి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని రామిరెడ్డి నివాసంలో కలిసి పూలబొకేలను అందించి సత్కరించారు. ఆయన్ను కలిసిన వారిలో సమాధి చైతన్య (యువజన విభాగం), నల్లూరు రమేష్(వాణిజ్య విభాగం), గయాజ్(మైనార్టీ సెల్), నందనవనం సీతాలక్ష్మి(మహిళా విభాగం), సుబ్రమణి క్సేవీయర్ కెన్నడీ(లీగల్ సెల్), ఎండ్రీవ్స్ కల్యాణ్‌కుమార్(ఎస్సీ సెల్), మేడా మాధవ(చేనేత విభాగం), పోసిన వెంకటరావు(దివ్యాంగుల విభాగం), పామంజి శ్యామ్(విద్యార్థి విభాగం), పేరం నాగరాజు(ఆర్టీఐ విభాగం), బత్తల మోహన్‌రెడ్డి(రైతు విభాగం), సన్నిబోయిన ప్రసాద్(బీసీ సెల్), బాపట్ల వెంకటపతి(ఎస్టీ సెల్), కనుపర్తి రాజశేఖర్(మున్సిపల్ విభాగం), మడతల సుబ్బారెడ్డి(ట్రేడ్ యూనియన్), గండ్ల శ్రీహర్ష(ఐటీ విభాగం), పిట్టు శ్రీనాథ్(గ్రీవెన్స్ సెల్), చింతలబోయిన వెంకటేశ్వర్లు(పంచాయతీరాజ్), మేకా విజయారావు(వలంటీర్ల విభాగం), నుశెట్టి పోలేశ్వరి(అంగన్‌వాడీ విభాగం), నాసిన శివలింగయ్య(సాంస్కృతిక విభాగం), బోగిరి విన్సెంట్(క్రిస్టియన్ మైనార్టీ సెల్), డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు(డాక్టర్స్ విభాగం), నాగరాజు(ఇంటెలెక్చువల్స్ ఫోరం), రామపురం ప్రవీణ్(సోషల్ మీడియా), చిరసాని వరుణ్‌రెడ్డి(బూత్ కమిటీలు), పుల్లా శ్రీనివాసులురెడ్డి(ప్రచార విభాగం) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, బోగోలు మండలాధ్యక్షుడు మద్దినేని వీరరఘుయాదవ్, కావలి రూరల్ అధ్యక్షుడు వాయిల తిరుపతి, అల్లూరు మండలాధ్యక్షుడు బీద రమేష్, ప్రధాన కార్యదర్శి నీలం సాయికుమార్, కావలి జెడ్పీటీసీ జంపాని రాఘవులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఉదయగిరి : మండలంలోని వివిధ లేఅవుట్లలో నిర్మాణంలో ఉన్న ఎన్టీఆర్ పక్కా గృహాలను వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. మండలంలోని గండిపాళెంలో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ గృహాలను మంగళవారం పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి నెలాఖరు తర్వాత కొత్త స్కీమ్ అమలులోకి రానున్న నేపథ్యంలో ప్రస్తుత పక్కాగృహాలు రద్దయ్యే అవకాశం ఉందని, దీనివల్ల త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వీరేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

సహకార సిబ్బందికి శిక్షణ

సంగం : సంగం పీఏసీఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సిబ్బందికి కోవూరు సబ్ డివిజనల్ సహకార సంఘం అధికారిణి సుభాషిణి, సివిల్ సప్లైస్ టెక్నికల్ అధికారి సుమతి మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన టెక్నికల్ విషయాలపై అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకార సంఘం అధికారి సుభాషిణి, సొసైటీ సీఈఓ దస్తగిరి పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

కావలి : మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ కోరారు. కావలి అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆమె మంగళవారం పాల్గొని, మాట్లాడారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఇరు పార్టీల వారు సమన్యాయం పొందవచ్చని తెలిపారు. సమావేశంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ జి.విక్రమ్ సిన్హా, స్పెషల్ మేజిస్ట్రేట్ వై.పరుసురాం, ఏపీపీ మృదుల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేంద్రరెడ్డి, సెక్రటరీ ఎం.జయప్రకాష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వేలను పూర్తి చేయాలి



సీతారామపురం : మండలంలో సచివాలయ సిబ్బంది చేపడుతున్న జియో ట్యాగింగ్, హౌస్‌హోల్డ్, అక్షరాస్యత, పీఏసీఎస్ ఈకేవైసీ, ఎన్‌పీఐఐ లింక్స్, పిల్లల ఆధార్ నమోదు, మిస్సింగ్ సిటిజన్స్ వంటి సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ కోరారు. ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వేల పురోగతిపై మంగళవారం సమీక్ష జరిపారు. క్లస్టర్ల వారీగా వివరాలు సేకరించి వెనుకబడిన సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యాలయ ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మార్చి చివరికి గడువు

వరికుంటపాడు : స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది చేస్తున్న కేన్సర్, కుష్టు, ఎన్‌సీడీసీ సర్వేలను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సువార్తమ్మ పేర్కొన్నారు. వారు వైద్యశాలలో సిబ్బందితో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గర్భిణుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.